ఈ వారం కథ

■ యెన్నం ఉపేందర్



# పీర్లు ఒరిగినై

అమ్మ దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. ఎవరి తోనో ఉత్తరం రాయించినా అక్షరాల్లో అమ్మ కంట తడి కని పించింది. ఇంతకాలం నేనెందుకు గుర్తుపట్టలేకపోయానో!

ఉదయం లేస్తూనే దినపత్రిక చూడటం, పాలుపట్టడం, పళ్ళు తోమటం... ఆఫీసు, ఫైళ్లు...జీవితం ఎంతగా కుదిం చుకపోయింది? నగర జీవనం, యాంత్రికత! ఎంతవరకు ఈ ఉరుకులు పరుగులు?

జీవితం ఒక వృత్తం. ఆ వృత్తం చుట్టూత ప్రయాణం. అమ్మ పంపించే ఉత్తరాల్ని ఎన్నడైనా గట్టిగా చదివానా? టెలిగ్రాఫ్, టెలిఫోను, ఇ-మెయిల్... జీవితం హైటెక్ మయ మైంది... చేతి వ్రాతలోని వ్యక్తిత్వ స్పర్శ మాయమైంది.

ఉత్తరం వైపు చూసాను. 'ఊరెళ్ళకూడదా'అన్నట్లు అక్ష రాలు ప్రశ్నిస్తున్నాయి. అక్షరాల్ని తడిమాను. తడితడిగా తాకిన అనుభూతి.

కళ్ళు మూసుకున్నాను.

అమ్మ పిలుస్తున్న దృశ్యం.

రారా! అమ్మ పిలుస్తోంది. బాల్యంలోకి పాక్కుంటూ వెళ్ళనా?

పచ్చటి పంటపొలాలు, చెరువుకట్ట, కొంగల బారు! రాత్రి వేళ మిలమిల మెరిసే నక్షత్ర సమూహం.


అన్నట్లు, తూర్పున ఉదయించే సూర్యుని చూసి ఎన్ని సంవత్సరాలైంది?

గచ్చకాయలు, గోలీలాటలు, దొరోరి బావిలో ఈత కొట్టుడు... బుర్రకథ, చిరుతల రామాయణం, సవార్ల పండుగ...

ఇంకా నగరంలో ఉండలేకపోయాను.

బస్టాండు రద్దీగా ఉంది. హైటెక్ బస్సులో చాలా దూరం ప్రయాణించి, ఓ మామూలు టౌన్లో దిగాను. అక్కడనుంచి వేరే బస్సెక్కి వెళ్ళవలసి ఉంటుంది. ఓ రెండు గంటల నిరీ క్షణ తర్వాత మా ఊరివైపు వెళ్ళే ఎర్రబస్సొకటి వచ్చింది. బస్సు ప్లాట్‌ఫారమ్‌మీదకు రాకమునుపే జనం బస్సుపై పడ్డారు.

కొంతమంది నోట్లో తువ్వాలు కరుచుకొని, ఏదో ఒక కిటికీ ద్వారా సీట్లు రిజర్వు చేసుకుంటున్నారు. మరికొం దరు ఎకాఎకి డ్రైవరు సీటు ద్వారా బస్సులోనికి జొరబ డ్డారు.



అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న ప్రదేశం గందరగోళంగా మారి పోయింది. తాపీగా బస్సెక్కి ఊరి అనుభవాల్ని తలచుకుంటూ గతం లోకి ప్రయాణిద్దామన్న నా ఆశ నెరవేరదని తెలిపోయింది.

'ఇంతమంది జనం ఎక్కడ నుంచి ఊడిపడ్డారు?' నేను కూడా అందులో భాగమన్న విషయం జ్ఞాపకం వచ్చి మిన్నకున్నాను. ఎలాగోలా జనాన్ని తోసుకుంటూ బస్సువె క్కాను. కాసేపటికి, మన్నుదిన్నపాములా బస్సు కదిలింది.

ఇంతలో ఒకావిడ నెత్తిన కూరగాయల గంపతో బస్సుకు అడ్డమొచ్చింది. డ్రైవర్ సడన్‌బ్రేకు వేయటంతో బస్సులోని ప్రయాణీకులు ఒకరిపైఒకరు పడ్డారు. అందులోని ఒక తను, "ఓ డ్రైవరన్నా! ఏంది సంగతి? బస్సును జర నెమ్మ దిగా తోలరాదే. ముసలోల్లు, పోరగాండ్లున్నరు. అసలే కాలం బాగాలేక ఉప్పులు పాసాల్తో, రోగాల్నొప్పుల్తో ఉంద్రు. బస్సులుండంగనే యమలోకం పంపిస్తావే?" వెట కారంగా పలికాడు డ్రైవర్.

అది విన్న డ్రైవర్,

"గట్లంటవేంది తమ్మీ! గామె రోజు గీ బస్సుల్నే మార్కెట్ల కూరగాయలు కొనుక్కొని ఎక్కుద్ది. మారుబేరం సేత్తదట. పొట్టకూటికి కోటి తిప్పలు..." డ్రైవర్ నిట్టూర్చాడు.

డ్రైవర్‌లోని మానవతా కోణం నాలో కొత్త ప్రశ్నలకి తెరలే పింది.

"అదెట్ల? ఊళ్ళ పండిన కూరగాయల్ని పట్నం తీసక పోయి అమ్ముకుంటరు కని, పట్నంల కొని పల్లెల్ల అమ్ము డేంటి?" మనసు గతాన్ని తవ్వసాగింది.

నా చిన్నతనాన, ఉదయాన్నే గంపల్లో కూరగాయలు తీసుకొచ్చేవారు. తాజాగా, రుచిగా ఉండేటివి. అప్పటి నాటు కూరగాయలు ఏమైనట్లు?

"పెద్దయ్యా! కూరగాయలు ఊళ్ళనుంచి పట్నానికి రావాలగదా. ఈడకొని ఊళ్ళకు తీసకపోతందేంది?" ఆశ్చ ర్యంతో అడిగాను.

విన్న పెద్దాయన నావైపు ఓ మారు అదోలా చూసి, 'లాగు లడాయి ఏసుకున్న పట్నపోడన్న'ఫీలింగుతో,

"గట్ల సేయబట్టి ఎన్నేండ్లో అయితంది. గిప్పుడు కొత్తగా షురుజేసుడేంది? తినడానికి తిండి గింజలే పండట్లేదు. ఇంక కూరగాయలు పండిత్తమా?" ముఖం విరిచాడు.

కొంచెంకొంచెంగా పరిస్థితి అర్థంకాసాగింది. నే దిగా ల్సిన స్టేజి వచ్చింది. ఓ మూడు మైల్లు నడిచిన తర్వాత మా ఊరి పొలిమెర వచ్చింది. కాలి బాట పక్కనే పోలేరమ్మ విగ్రహం కనిపించింది. ఎలాంటి పూజలు చేస్తున్న దాఖలా లేదు. నా చిన్నతనాన పోలేరమ్మ విగ్రహాన్ని చూడాలంటే జడుసుకునే వాళ్ళం. నిమ్మకాయలు, మంత్రుకలు, కోడి కాళ్ళతో పరిసరాలు నిండి ఉండేవి. ఇప్పుడు విగ్రహం 'మామూలుగా' ఉంది. చుట్టూ కలియజూసాను. ఎక్కడ పచ్చగా పంటచేలు కనిపించలేదు.

ఊళ్ళో ప్రవేశిస్తుండగా అబ్బల్ ఎదురైనాడు. కొద్దిసేపు కిందమీద చూసి,

"ఓ బేటా! నువ్వా! నేనెవరో అనుకున్న. యేడ పన్జేత్త న్నవ్? అమ్మను తీస్కబోతవా నీ తోటి?"అడిగాడు.

"ఆ... పట్నంలుంటున్నా" ముక్తసరిగా పలికాను.

మా ఇంటికి వెళ్ళాలంటే ముందుగా జాఫర్ ఇల్లుదాటే వెళ్ళాలి. జాఫర్ మియా, మా తండ్రి మంచి స్నేహితులట. నా చిన్నతనాన జాఫర్ మియా నాకు ఉర్దూ నేర్పుతానని ఎంతో ఖాయిసుపడ్డాడట. నేనే పడనీయలేదని అమ్మ అంటుంటది.

జాఫర్ మియాను చూసిపోవాలనిపించింది. జాఫర్ మియా ఇంటిముందు కంప చెట్లు పెరిగాయి.

"జాఫర్ మియా లేడా"అని ఎవరో యువకుడు వెళ్తూంటే అడిగాను. అతను నావైపు అదోలా చూసి, "ఆయన సచ్చి శానేండ్లయింది. కొడుకులు, బిడ్డలు పట్నంల బతకబోయిండ్రు"అన్నాడు. అరికాల్లో ముల్లు దిగినట్లైంది. ముందుకు సాగాను. పీర్ల కొట్టం ఎదురైంది.

పీర్లకొట్టం బాగా పాతబడింది. 'పీర్ల పండుగ దగ్గరకొ స్తంది. ఏం ఏర్పాట్లు చేయట్లేదు?' మనసులో అనుకుంటూ ఇంటికి సమీపించాను.

కుమ్మరి పెంకులతో కట్టిన ఇల్లది. అక్కడక్కడ పెంకులు పగిలిపోవటం వలన సూర్యకాంతి బిళ్ళలు ఇంటిలోపల అక్కడక్కడ కనిపిస్తున్నాయి. గోడకు దండేసిన నాన్న ఫొటో కనిపించింది. కళ్ళు చమర్చాయి.

"యిన్నేండ్ల తర్వాత నారా వచ్చేది"అని ప్రశ్నిస్తున్న ట్లున్న నాన్న చూపులకు తలొంచుకున్నాను. అమ్మ రోట్లో ఏదో దంచుతున్న శబ్దం వినబడింది. 'హూ' తీసాను.

బల్లపై సూట్‌కేసు పెట్టాను. సూట్‌కేసు బల్లపై పెట్టేప్పుడు చేయి వణికి సూట్‌కేసు కింద పడింది. అమ్మను పిలవటానికి ప్రయత్నం చేసాను. నోరు పెగల లేదు. గొంతు సవరించుకోసాగాను.

దర్వాజా దగ్గర అమ్మ ప్రత్యక్షం. సూట్‌కేసు చేసిన శబ్దాన్ని విని వచ్చిందని అర్ధం చేసుకున్నాను. అమ్మవైపు రెండడుగులు వేసాను. అమ్మ పరుగున నన్ను చేరుకుంది. నా కడుపులో తలపెట్టి, వీపుచుట్టూ చేతులు వేసింది. అమ్మ గట్టిగా ఏడవ సాగింది.

''కొడుకా! కొడుకా! ఎన్నేండ్ల కొస్తివిరా కొడుకా. ఇన్నేండ్లకు మా మీద నెనరు కలికిందా. నాయనో! నాయనా! ఏ లోకాలకు ఎగిరిపోతివి దేవుడా! నా దేవుడా! యియ్యాల నీ కొడుకొచ్చిండు దేవుడా! దేవుడా! ఏం కాలమొచ్చెరా కొడకా! ఓ కొడుకా! మీ నాయనున్నప్పుడు కొడుకా! కొడుకా! నూకలన్న దొరికేటివిరా కొడుకా! కొడుకా! యియ్యాల సూడబోతే కొడుకా! ఓ కొడుకా! గంజన్న దొర్కట్లేదురా కొడుకా! ఓ కొడుకా!''

అమ్మ ఏడుపుకు చుట్టుపక్కలున్న వారందరూ వచ్చారు. కొడుకొచ్చిండు కొడుకొచ్చిండని వారిలోవారు 'గుస''గుస' లాడుకోసాగారు. నాకు ఒక్కసారిగా అపార్టుమెంటు జీవితం జ్ఞాపకం వచ్చింది. ఏ ఫ్లాట్లో ఎవరుంటున్నారో ఏనాడు తెలుసుకోవాలని అనిపించలేదు. కష్టసుఖాలు ఆ నాలుగు గోడలకే పరిమితం.

అమ్మతోపాటుగా నేనుకూడా ఏడ్చాను. ఎవరో అమ్మను చేయిపట్టుకొని కాళ్ళకట్టుమంచంపై కూర్చోబెట్టారు. నేను బల్లపై కూర్చొన్నాను.

పావుగంట సేపు అమ్మ వలవల ఏడ్చేసరికి, ఆ ఉద్వేగంలో ఎక్కడికో కొట్టుకపోయాను. అమ్మలో భౌతికంగా ఎంత తేడా?!

వంటినిండా ఆభరణాల్తో, సందడిగా అటుఇటు తిరుగుతూ పనులు పురమాయించిన అమ్మ నేడెలా అయిపోయింది! చేతులు గరుకుగా అయ్యాయి. కాళ్ళు చిట్లాయి. చర్మం పెలుసులుగా తయారైంది. నడుము కాస్త వంగింది.

''అయ్యా! ఆకలైతన్నాలె. ఎప్పుడు తిన్నవో ఏందో.'' వంటింట్లోకి పరుగెత్తింది అమ్మ.

అమ్మెలా ఉండేదో ఊరు అలా పచ్చగా ఉండేది. ఇప్పుడు ఊరెలా వాడిపోయిందో, అమ్మ అలా పాలిపోయింది.

కళ్ళెంట నీళ్ళు వచ్చాయి. వేమన పద్యం పక్కింటి రేడియో వినబడుతుంది. 'తల్లిదండ్రులందు దయలేని పుత్రుడు...'

పొయ్యిమీద ఎసరేసి అమ్మ తిరిగొచ్చింది. నాగూర్చి అమ్మ అన్ని వివరాలు అడిగింది. అమ్మ ముఖంలో కొంత ఉత్సాహం, కొంత దిగులు కనిపించాయి. అమ్మను జాఫర్ మియా కుటుంబం గురించి అడిగాను.

''ఏముంది నాయనా! కరువు రోజులు. జనం ఆకలికి అలమటిస్తండ్రు. సెర్లల్ల, బావులల్ల నీళ్ళు లేవు. జాఫర్ మియా ఎన్నేండ్లని కూలిమీద బతుకుతరు? పిల్లలెదిగి వచ్చిరి. పట్నం బోయిండ్రు''అమ్మ భారంగా చెప్పింది.

''పల్లెల్లో ఇన్ని కష్టాలా'' తల భారంగా అనిపించింది.

సాయంత్రం 'సెంద్రు'వచ్చాడు. సెంద్రు నేను బాల్యమిత్రులం.

''ఏం సెంద్రు! బాగున్నవా'' అన్నాను.

''ఆ ఏదోలె. మీరు బాగున్నరా''

''అలా అంటవేంది? ఏమైనా ఇబ్బందులా?''

''...ఊళ్ళేముంది? మీలాంటోళ్ళు పట్నంల కడుపుల సల్ల కదలకుండా ఉంటరు''

''ఏం పనిజేస్తున్నవ్''

''ఓ మేళ్ళంల షరీకైన. పేళ్ళీలకు సావులకు బోతున్నం. జరుగుబాటు బవుకట్టంగున్నది''

''అన్నట్లు సత్తెం ఏంజేస్తండు''

''సూతారి పని''

సత్తం, సెంద్రం చదువు బాగా చదివేవారు. చదువు అలా కొనసాగిస్తే వారి జీవితాలు బాగుండేటివేమో!

కాసేపు కూర్చొని లేవబోయేంతలో ముత్తమ్మ వచ్చింది.

''అమ్మా! బాబొచ్చిండటగా. సూరి పోదామనొచ్చిన''అన్నది ముత్తమ్మ.

మనిషి బాగా వంగింది. చిన్నప్పుడు నన్నెత్తుకొని నా ఆలనాపాలనా తానే చూసిందట. ఆమె కొడుకు మల్లన్న నేను కలిసి చదువుకున్నం.

''ముత్తమ్మా! బాగున్నవా''అడిగాను.



అమ్మ నావైపు చూసి నవ్వింది. ఆ నవ్వులో నా చిన్నతనపు అమ్మ రూపం కనిపించింది. నా బాల్యపు ఊరు దృశ్యించింది. అమ్మ ఆ మట్టిమనిషి. నేను పరాయీకరింపబడ్డాను.

నన్ను గుర్తుపట్టి,

''అమ్మో! బాబుగారా. బాగున్నరా అయ్యా''అడిగింది.

''ఆ మల్లన్న ఏం జేస్తున్నడు''అడిగాను.

మల్లన్న మాట వినగానే,

''ఎక్కడ మల్లన్న బాబు. సేదగ్గతోని నవుసి నవుసి సచ్చిండు. వాడు బోయి శానేండ్లాయె'' కళ్ళు తుడుచుకుంది ఆమె.

నా మనసు కలుక్కుమంది.

''సిన్నోడు ఏం జేస్తండు'' అడిగాను.

''మొన్న యింజనీరింగుల సీటొచ్చిందట నాయనా. ఫీజు కింద బోలెడు రూపాయలు కావాలందు. ఈ ఎటమొట కాలానికి ఎవరప్పిస్తరు కొడకా. ఉరి బెట్టుకొని సచ్చినోళ్ళకి గవుర్మెంటు పదివేలిస్తదంటే ఉరిబెట్టుకున్న కొడుకా. ఇంటి పక్కనున్నోళ్ళు యిడిపించిండ్రు. తర్వాత తర్వాత తెల్సింది కొడకా. నాలాంటోళ్ళు శానమంది ఉరేసుకుంటండ్రని గవుర్మెంటు పైసలిచ్చుడు బందుసేసిందట. నేను సచ్చైనా నా కొడుక్కి పీసు డబ్బులు కల్గిద్దామనుకుంటే దేవుడు పడనీయడాయె''

ముత్తమ్మ మామూలుగా మాట్లాడుతూనే ఉంది. నా కళ్ళెంట అప్రయత్నంగా నీళ్ళొచ్చాయి. ఆరోజు రాత్రి నిద్ర పోలేదు. మరుసటి రోజు అమ్మతో,

''అమ్మా! పీర్ల పండుగ దగ్గరకొచ్చింది కదా. సూడబోతే ఏం ఏర్పాట్లు సేస్తన్నట్లు కన్పడ్తలేదు''అన్నాను.

''కాలం కరకరని కాల్చుకు తింటాంటే పండగలేం జేస్తరు? జనం అరిగోస పడ్తండ్రు''అన్నది అమ్మ.

నా చిన్నతనం జ్ఞాపకం వచ్చింది.

సవార్ల పండుగ జరిగే పది దినాలు సెంద్రుతో కలిసి తిరిగేవాణ్ణి. 'పెట్టె కదిలించుడు'మొదలుపెట్టి, సవార్లు 'బావిలో పడేంతవరకు' పీర్లెంట తిరిగేవాణ్ణి... కుల మతాలకు అతీతంగా పీర్లను నిలబెట్టేవారు. అర్ధశేరు బియ్యం, ఊదుకడ్డీలు, అర్ధరూపాయి తీసుకొని కంసాలి వారింటికి వెళ్ళి పీరీలను తోమించేవారు. 'గుండం'తవ్వించి, మూడొద్దుల్లో, ఐపొద్దుల్లో, తొమ్మిదోరోజున 'సరిగస్తు' చేయించేవారు.

ఈసుమియా సవార్ని పట్టుకొని 'సిగమూగుతాంటే' జనం ఉర్రూతలూగేవారు. ఎంతమంది పట్టుకున్నా ఆగక ఈసుమియా నిప్పులు గుండంలో దూకేవాడు. సంతానం లేనివారు, 'గాలి'సోకిన వారు ఈసుమియా చేత కొరడాతో కొట్టించుకునేవారు.

ఇదిలా ఉంటే, యువకులు జనం కన్నుగప్పి వారి వ్యవసాయ పనిముట్లు, కాళ్ళకట్టు మంచాలు తీసుకొచ్చి నిప్పుల గుండంలో వేసేవారు.

ఓసారి అబ్బయ్య, పొరక చేత బట్టుకొని, శరీరమంతా బండి ఆముదం రుద్దుకొని 'లేకేశం'వేసాడు. గుండం చుట్టూ డప్పులు శబ్దం చేస్తుంటే, అడుగేయసాగాడు. ఆయన పడుకునే మంచం ఎవరో తీసుకొచ్చి నిప్పుల గుండంలో వేసిన సంగతి గమనించకుండానే గుండం చుట్టు ఎగిరి, విషయం తెలుసుకొని లబోదిబోమన్నాడు.

పీర్ల పండుగంటేనే జనానికి అత్యంత వినోదం. భేతాళ వేషం ప్రత్యేకాకర్షణ. బుచ్చయ్య, శేరు సారా తాగి, కత్తి చెంపకు కుచ్చుకొని వెంటబడితే మేమెలా పరుగెత్తేవాళ్ళం! పీర్లపండుగ తొమ్మిదో దినాన మేకపాలు గురిగలోపోసి, పైస లేసి గుండం పూడ్చే సన్నివేశం అందరి కళ్ళల్లో నీళ్ళు తెప్పించేది. ఆ సందర్భంలో ఈసుమియా పాడిన పాట ఇప్పటికీ గుర్తు.

''హాయె హాయె హాయెల్లా రోతకడే మాపల
రమ్మొడుమె పాతిమా కరబలమె కట్‌గలా
దులా మేరా మర్‌గయా రెండు ముజే కర్‌దియా
అల్విదాయో అల్విదా సాహెబ్ సహదా అల్విదా
... ... ...
... ... ...
చర్‌చా మన్‌కే కళ్యా జట్ పట్‌నే
బుల్ బుల్యా హాయె కైసే గమ్ రహే''

ఇప్పుడేమైంది? ఊరి భయ్యాక ముఖ చిత్రం నా కళ్ళ ముందు!

కరువు ఊరి జనాన్ని విడగొట్టింది. తల్లిని పిల్లనీ, యువకుల్ని ముసలి వారినీ, ఈసుమియాను అబ్బయ్యను కాలం నిర్దాక్షిణ్యంగా వేరుచేసింది.

ముత్తమ్మ ఉరిబెట్టుకోబోతే, ఊరి జనం ఆపారు. ఊరి జనమే ఉరేసుకుండే రోజొచ్చింది.

అమ్మ ఇంటి వెనకాల పిడకలు చేయసాగింది.

''అమ్మా! మనం పట్నమెళ్దామే''అన్నాను.

అమ్మ నావైపు చూసి నవ్వింది.

ఆ నవ్వులో నా చిన్నతనపు అమ్మ రూపం కనిపించింది. నా బాల్యపు ఊరు దృశ్యించింది. అమ్మ ఆ మట్టిమనిషి. నేను పరాయీకరింపబడ్డాను. అమ్మ చిరునవ్వును భద్రపరచుకొని పట్నం బయల్దేరాను.

కరవు కాటుకు ఆకలి చావులుండొచ్చేమో కానీ, అమ్మ ప్రేమకు కరవా? ★